అతడు హిట్లర్ వంటలవాడు. హిట్లర నియంతకు హితమైన ఆహారం కూర్చే కలాపానికంతకూ అతను కర్త

1938-వ సంవత్సరంలో కానెన్‌బర్గ పని రద్దీగావుండింది. అతడు హిట్లర్‌తో కలిసి ముసోలినీని కలుసుకోడానికి రోమ్ వెళ్ళాడు. అతడు హిట్లర్‌తో కలిసి నెవెల్లీఛేంబర్లేన్‌కు స్వాగతం ఇవ్వడానికి గాడెస్‌బర్గ వెళ్ళాడు.

తన పొట్టపూజకు ప్రధాన అర్చకుడయిన కానెన్‌బర్గ అంటే హిట్లరుకు వల్లమాలిన అభిమానం. విదేశపు రాయబారాలకు రాజ్యాంగవేత్తలకు అతణి పరిచయం చేయడమంటె హిట్లర్‌కు చాలా సరదా. అట్టి సందర్భాల్లో హిట్లర్ నియంత పలికే పరిచయవాక్యాలు ఎట్టివిగా వుంటాయి? 'ఇతడు హెర్ సెప్ కానెన్‌బర్గ— నా నియంత.' హిట్లర్ నియంతకు కానెన్‌బర్గ నియంత అన్నమాట.

ముసోలినీ, ఛేంబర్లేన్, డలాడియర్, ఎడ్మిరల్ హార్తీ మున్నగువారికి అందరకీ హిట్లర్ అతణ్ణి పరిచయం చేశాడు. హిట్లర్ యొక్క ఆహారపదార్థ నియామక విషయంలో కానెన్‌బర్గది తుదిమాట. ఆ విషయంలో అతడు నిజంగా నిరంకుశుడు. ఆ నియంతను కాదనడానికి ఎవరికీ అధికారం లేదు.

కానెన్‌బర్గకి, హిట్లర్‌కి గల పరిచయం చాలా కాలంనాటిది. 1923-వ నవంబరు మ్యూనిచ్ తిరుగుబాటుసందర్భంలో హిట్లర్ తల దాచుకోవడానికి పరుగెత్తవలసి వచ్చింది. అతడు అప్పుడు అట్లా పరుగెత్తుకు పోయి మ్యూనిచ్‌పట్టణం పరిసరంలో వున్న ఒక చిన్న ఇంట్లో తలదాచుకున్నాడు. ఆ యిల్లు కానెన్‌బర్గది. అప్పటికే అతడు వంటలవాడు. ఆ వంటలవాడికి హిట్లరు తిరుగుబాటుదారనీ, ఆతడికి ఆశ్రయం ఇవ్వడం ప్రమాదకరమైందనీ తెలుసు. తెలిసివుండీ కూడా కానెన్‌బర్గ హిట్లరుకి ఆశ్రయమిచ్చాడు. ఆ ఆపత్కాలంలో కానెన్‌బర్గ తనకు చేసిన సహాయాన్ని హిట్లరు మఱచిపోలేదు.

తాను అధికారంలోకి రావడంతోటే హిట్లరు కానెన్‌బర్గకు కబురుపంపి పిలుపించుకొని అతణ్ణి తన వంటలవాడిగా చేసుకున్నాడు. —పత్రికామిత్ర.

---

# వెన్నెలనే

## కవికొండల వేంకటరావు, బి.ఎల్.

(గీతిక)

వెన్నెల నే పయనమంటే
చంద్రలోకమునకు? కాదు.
నీ కడకో శోభనాంగి!
నీ నవ్వుగుండ లలితాంగి!

మోముచుట్టు మల్లెపూలు
మేలిముసుగ్గా వేసుకు,
వొంటినిండ జాజిదండ
సవరించుకు లేమమిన్న!

నవ్వుచుంటివా నడుస్తూ
పండువెన్నెలే నడుస్తూ
జారిపడే పూలనీడ
నూరి_స్తివ నన్ను?

తెల్లవారు సరికో హా!
అన్నిపూలు జారిపోయి
నీయొంటి పసిమిమిసమిసలు నాకు
నివ్వెర గొలిపేని వింత!

ఆనవాలు బట్టుటకొక
పువ్వుదారి గానవైతి;
నీనవ్వుల కిలకిలరుతి
పొడిగింపులె తుదకుమిగిలె

పువ్వులు! మఱిపానినీడ
లానవాలు బట్టుటకెటు
సాధ్యముగా నంతవడిగ
చెదరిపోయినవి. పూలు!

వెన్నెల! మఱిదానినాడు
మళ్ళివచ్చు నట్లేని
జాడసూప నంతవిధిగ
తరలిపోయినది. వెన్నెల!

నీ నడకకూడ నిలిపివేసి
నీకు నాకు మధ్యను, తెలి
నవ్వే యొక తెరగవేసి
ఆశయ మరికట్టినావు!

నవ్వుగుండ అన్నానని
ఉత్తినవ్వు తెరగవేసి
నన్నాపుట న్యాయమటే?
నాయూహ నీవెఱుగవటే?

నవ్వుతూంటే నవ్వునోట
తెల్లగ తెల్వారుటలో
ఎఱ్ఱగ రవి పొడుచుటలో
కనుటే నాపేరాస.